క్లుప్తంగా

తెలుగునాట సంప్రదాయాలకు పెద్దపీట



ముగ్గుల పోటీలో విజేతకు బహుమతి అందజేస్తున్న ఎస్ఎంఆర్ పెదబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తెలుగు నాట సంప్రదాయాలకు పెద్దపీట వేయడం అనాది నుంచీ ఆచారంగా వస్తోందని నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని స్థానిక 37వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి తోలేటి శ్రీనివాస్, వెంకట అన్నపూర్ణ శేష కుమారి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవం శనివారం స్థానిక సుబ్బమ్మదేవి మున్సిపల్ స్కూల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పెదబాబు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటే మహిళల్లో నూతన ఉత్సాహం వెల్లువెత్తుతుందని, తమ పెరటిలో వేసే ముగ్గులలో వారి నైపుణ్యం, సృజనాత్మకత స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు పెదబాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు నిడికొండ అన్నపూర్ణ నరేంద్ర, తంగెళ్ల రాము, సబ్బన శ్రీనివాసరావు, గుడివాడ రామచంద్ర కిషోర్, గాడి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సినిమా టికెట్ల కోసం ఘర్షణ

కొయ్యలగూడెం : సినిమా టికెట్ల కోసం థియేటర్ల నిర్వాహకులకి, ప్రేక్షకులకు మధ్య శనివారం వాగ్వివాదాలు చోటుచేసుకున్నాయి. కొయ్యలగూడెంలో ఉన్న రెండు థియేటర్లలో ఇద్దరు అగ్ర నాయకుల సినిమాలు రిలీజ్ అయిన నేపథ్యంలో ప్రేక్షకులు వేలాదిగా థియేటర్ల వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన టిక్కెట్ల స్లాబ్ ధరలకంటే రూ.50 ఎక్కువగా విక్రయిస్తుండడం, పరిమితికి మించి థియేటర్లో ప్రేక్షకులను అనుమతించడం వారికి తగిన సీటరింగ్ సౌకర్యం కల్పించకపోవడం ఘర్షణకు కారణమైందని ప్రేక్షకులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు థియేటర్ల వద్దకు చేరుకుని గొడవను సర్దుబాటు చేశారు.

వ్యక్తిపై దాడి

దెందులూరు : మండలంలోని దెందులూరు – అలుగులగూడెం రైల్వేట్రాక్ సమీపంలో ఉన్న పొలంలో శుక్రవారం జరిగిన ఘర్షణలో రైతుకు తీవ్ర గాయాలయ్యాయని ఎస్సై ఐ.వీర్రాజు తెలిపారు. గంగన్నగూడెంకు చెందిన మట్టా శివయ్య పొలంలో పనిచేస్తుండగా దెందులూరుకు చెందిన మరో ఇద్దరు నీటిసరఫరా, డబ్బు లావాదేవీల నేపథ్యంలో ఘర్షణ జరిగిందన్నారు. దీంతో దెందులూరుకు చెందిన ప్రభ, అతని అనుచరులు పారా, కత్తితో రైతు శివయ్యపై దాడి చేశారు. గాయపడిన శివయ్యను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వైభవంగా గోదా రంగనాథుల కల్యాణం



ఆర్ఆర్‌పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గోదా కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



జనార్దన స్వామి దేవస్థానంలో గోదా రంగనాథుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా పుష్య బహుళ సప్తమి పర్వదినమైన శనివారం నగరంలోని వివిధ వైష్ణవాలయాల్లో గోదా రంగనాయక స్వామి వార్ల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సాయంత్రం నుంచి ప్రారంభమైన కల్యాణ మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు కల్యాణ తంతు నిర్వహించగా ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాసఖ, కార్యనిర్వహణాధికారి ఆండ్ర రవిశంకర్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. అగ్రహారంలోని భూ, నీళా సమేత జనార్దన స్వామి దేవస్థానంలో ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవలు చేసి, విశేష పూజలు నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. స్వామి వారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కొనకళ్ల సత్యనారాయణ, కొనకళ్ల రామకృష్ణ దంపతులచే గోదా రంగనాయక స్వామి వార్ల కల్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు వంగల పవన్ కుమార్ విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్ల రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు. పవర్ పేట శ్రీదేవి, భూదేవి సమేత వాసుదేవస్వామి దేవస్థానంలో స్వామి గోదా కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణం అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. అర్చకులు కందుకూరి వెంకట విజయకుమార్ విశేష పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి ఎం.రామాంజనేయులు కార్యక్రమాలు పర్యవేక్షించారు. పవర్‌పేట బడేటి వారి వీధిలోని కోదండ రామాలయంలో ఉదయం గోదా రంగనాయకుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. అర్చకులు నారాయణం కోదండ రామాచార్యులు, లక్ష్మణ రంగసాయి ఫణి కుమార్ ప్రత్యేక పూజలు చేయగా, ఆలయ ధర్మకర్త జవ్వాజి మోహన్ విఠల్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

వీనుల విందు చేసిన కల్యాణ కీర్తనలు



ఆర్ఆర్‌పేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదా కల్యాణ కీర్తనలు ఆలపిస్తున్న డీవీఎల్‌పీ కుమార్ బృందం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, విష్ణు సహస్రనామ పారాయణ చేసి, నిత్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించి, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం తెనాలికి చెందిన నోరి నారాయణ మూర్తి శ్రీమద్రామాయణం – బాలకాండ అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. నగరానికి చెందిన డీవీఎల్‌పీ కుమార్ బృందం గోదా కల్యాణం సందర్భంగా కల్యాణ కీర్తనలను ఆలపించి భక్తుల వీనుల విందు చేశారు. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు చేయగా, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ఈఓ ఆండ్ర రవిశంకర్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

నేత్రపర్వం.. ఆకాశ జ్యోతి దర్శనం



విశేష అలంకరణలో బాల అయ్యప్ప స్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక దొండపాడు బాల అయ్యప్ప క్షేత్రంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు అయ్యప్ప స్వామికి 11 రకాల ద్రవ్యాలతో అభిషేకం, అనంతరం స్వామివారికి విశేష అలంకరణ చేశారు. 108 రకాల స్వీట్లు, పండ్లు, ఫలహారాలతో స్వామి వారికి మహానివేదన చేశారు. సాయంత్రం 6.30 గంటలకు శబరిమలైలో జ్యోతిదర్శన సమయంలో బాల అయ్యప్ప క్షేత్రంలో ప్రతిష్ఠితమైన పావన పదునెట్టాంబడికి అఖండ కర్పూర జ్యోతి నీరాజనం, బాల అయ్యప్ప స్వామి దివ్యదర్శనం, ఆకాశ జ్యోతి దర్శన కార్యక్రమాలు నేత్రపర్వంగా నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు నగరానికి చెందిన నాట్యాచార్యుడు డి.హేమసుందర్ శిష్యులచే కూచిపూడి, జానపద నృత్యాల ప్రదర్శన చేశారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 12న ఆలయం వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆలయ అర్చకులు రొంపిచర్ల వెంకట రఘు ప్రత్యేక పూజలు చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ఆలయ వ్యవస్థాపకులు గుమ్మడిదల సీతారామయ్య గురుస్వామి, నిర్వహణ కమిటీ సభ్యులు బోళ్ల సత్యనారాయణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

దుస్తుల పంపిణీ



చిల్డ్రన్స్ హోమ్‌లో దుస్తులు పంపిణీ చేసిన ఎస్ఎంఆర్ పెదబాబు

ఏలూరు టౌన్: తెలుగు వెలుగుల సంక్రాంతి పండుగను ప్రజలంతా సంతోషంగా నిర్వహించుకోవాలని, పిల్లలు ఉన్నత భవితకు బాటలు వేయాలని ఆకాంక్షిస్తూ రవితేజ చిల్డ్రన్స్ హోమ్‌లో ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు సంక్రాంతి వేడుకలు చేశారు. చిల్డ్రన్ హోమ్‌లోని 40 మంది చిన్నారులకు రెడీమేడ్ దుస్తులు పంపిణీ చేశారు. చిన్నారులు మంచిగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తంగెళ్ల రాము, సబ్బన శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు గుడివాడ రామచంద్ర కిషోర్, వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు నిడికొండ నరేంద్ర, నాయకులు గాడి బాలాజీ తదితరులు ఉన్నారు.

పల్లెల్లో కోడి పందేల సందడి



చాటపర్రులో కోడి పందేలను తిలకిస్తున్న ప్రజలు
చాటపర్రు బరిలో కాలుదువ్వుతున్న కోళ్లు

ఏలూరు రూరల్: ఏలూరు మండలంలో శనివారం కోడి పందేలు, జూదాల సందడి ప్రారంభమైంది. కొమడవోలు, చొదిమెళ్ల, జాలిపూడి, చాటపర్రు, గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక కొల్లేరు గ్రామాల్లో ఉదయం 11 గంటల నుంచి 20కు పైగా ప్రధాన బరిల్లో కోడి పందేలు, 50కు పైగా టెంటల్లో జూదం నిర్వహించారు. మరో 70కు పైగా బోర్డుల్లో గుండాటలు నిర్వహించారు. ఏలూరు నగరం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, పందెరాయుళ్లు తరలివచ్చారు. నిర్వాహకులు భారీ టెంట్లు వేశారు. చాటపర్రు, జాలిపూడిలో మహిళలు సైతం కోడిపందేలను తిలకించారు. బరుల వద్ద తినుబండారాల స్టాళ్లను ఏర్పాటుచేశారు. ఆయా ప్రాంతాలు తిరునాళ్లను తలపించాయి. సంక్రాంతి సందర్భంగా జాలిపూడి, చాటపర్రులో వాలీబాల్, ఎడ్లబండ్ల పోటీలు చేపట్టిన సంగతి తెలిసిందే.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	50	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	54	ములక్కాడలు	10–12
బెండకాయలు	54	కంద	40
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	40
కాకర కాయలు	30–34	కీరా దోస	50
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	66
బీరకాయలు (పందిరి)	--	అల్లం	60
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	40	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	26	గోంగూర	06
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	34	బఠాణీ	56
అనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	66
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	32–40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	00
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	00
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	06
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	03
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	02
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	01
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	01
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	02
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	00
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	30
ఏలూరు –తిరుపతి	16.00	4830	33
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.00	98512	31
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.50	98509	31

ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): సంక్రాంతి సందర్భంగా ఐద్వా ఆధ్వర్యంలో గన్‌బజార్, కబాడీగూడెం ప్రాంతాల్లో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.కిషోర్ మాట్లాడుతూ వ్యవసాయ పంటలు చేతికి వచ్చిన ఆనందంలో ప్రజలు నిర్వహించుకునే పండుగ సంక్రాంతి అని అన్నారు. కోడి పందాలు, జూదం వంటి చెడు వ్యసనాలు వైపు వెళ్లకుండా ఆట పాటలతో ఆనందంగా పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి,నాయకులు చింతాడ వెంకటలక్ష్మి, బవ్య,ఝాన్సీ,వరలక్ష్మి, ఎస్ సైదున్నీసా, సీహెచ్ లక్ష్మి, సభీల, ఎస్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

● ప్రకృతి సోయగం



తెలతెలవారే సమయంలో మంచు దుప్పటిని చీల్చుకుంటూ పచ్చని పొలాలపై ప్రకృతి సింధూరం కనువిందు చేసింది. సంక్రాంతి సంబరాలు పట్టణం నుంచి పల్లెకు పయనమవుతోన్న వేళ ఈ అందమైన దృశ్యం కొవ్వలిలో ఆవిష్కృతమైంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు

శ్రీవారి సేవలో గోపాలపురం ఎమ్మెల్యే తలారి

ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శనివారం సందర్శించారు. భోగి పండుగను పురస్కరించుకుని ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాధరావు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్ కుంటం స్వర్ణలత, ఉక్కుర్తి వెంకట్రావు, బొండాడ సాత్యకిరావు, మానుకొండ సుబ్బారావు, గుర్రాల లక్ష్మణ్, జంగా వెంకట కృష్ణారెడ్డి తదితరులున్నారు.